# రహదారుల, వంతెనల అభివృద్ధికి చర్యలు

**భైంసా, న్యూస్‌టుడే:** జిల్లాలో ఆర్‌అండ్‌బీశాఖ రహదారులు, వంతెనల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టామని ఆశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సునిల్‌శర్మ అన్నారు. బాసర పుణ్యక్షేత్రాన్ని బుధవారం దర్శించుకున్న ఆయన అనంతరం ముథోల్ నియోజకవర్గంలోని భైంసా, లోకేశ్వరం, ముథోల్, తానూరు, కుభీరు మండలాల్లో చేపడుతున్న రహదారులు, వంతెనల అభివృద్ధి పనులను ఎస్‌ఈ రాజరెడ్డి, నిర్మల్ ఈఈ రమేశ్, భైంసా డీఈఈ రవీందర్‌రెడ్డిలతో కలిసి పర్యవేక్షించారు. అనంతరం కొద్దిసేపు భైంసా ఆర్‌అండ్‌బీ అధితి గృహానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. పనుల నాణ్యతపై రాజీలేదన్నారు. ప్రభుత్వం కేటాయించిన నిధులతో జిల్లాల్లో వివిధ రహదారులు, వంతెనల నిర్మాణ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. రూ.533 కోట్ల వ్యయంతో 389కి.మీ జిల్లా- మండల అనుసంధాన రహదారులు 21 నిర్మాణంలో 13 ప్రగతిలో ఉన్నాయన్నారు. అలాగే సింగిల్ నుంచి డబుల్ రహదారిగా మార్చే 22 పనుల్లో ఏడు పూర్తయ్యాయని ఎనిమిదింటికి టెండర్లు పిలవాల్సి ఉండగా మూడు ప్రగతిలో ఉన్నాయన్నారు. వివిధ మార్గాల్లో 86 వంతెనలు నిర్మించాల్సి ఉందని వాటిలో 35 ప్రగతిలో ఉండగా 15 టెండర్లు పిలవాల్సి ఉందని పేర్కొన్నారు. పది ప్రారంభించామని, 17 టెండరు దశలో ఉన్నాయన్నారు.



రహదారి నాణ్యత పనులను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ కార్యదర్శి, సునిల్‌శర్మ, ఎస్‌ఈ రాజరెడ్డి, ఈఈ రమేశ్‌లు